క్లుప్తంగా

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో నిర్వహిస్తున్న వేసవి ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శుక్రవారం పట్టణానికి చెందిన సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. సర్పంచ్ ఇందూర్ సాయన్న, ఎంపీటీసీ బాల నర్సయ్య, ప్రిన్సిపల్ ధనవేణి, యూనిట్ అధికారిణిలు స్వప్న, బబిత పాల్గొన్నారు.

'కంటి' శిబిరాలు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం రాంపూర్‌లో శుక్రవారం సర్పంచ్ బంటు దయానంద్ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ గంట గంగాధర్, వైద్యాధికారిణి పూజా రెడ్డి, సల్మాన్, ఎంపీటీసీ నూతుపల్లి భూదేవి పాల్గొన్నారు.

మాదాపూర్‌లో..

మాక్లూర్: మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ కొట్టాల లక్ష్మి ప్రారంభించారు. మండల వైద్యాధికారి సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ముగిసిన శిబిరం

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 36 వార్డులలో కంటి వెలుగు శిబిరం ముగిసిందని శిబిరం కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. 16,327 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. వారిలో 2,178 మందికి కంటి అద్దాలు అందజేశామని,, అలాగే 2,198 మందికి ఆర్డర్‌పై అందజేశామన్నారు. 881 మందిని వైద్య పరీక్షల కోసం జిల్లాకు సిఫారసు చేసినట్లు వెల్లడించారు.

పందులను తరలించండి

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో పందుల బెడదను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ నర్సింహారెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, విద్యానగర్, మహాలక్ష్మి కాలనీల్లో కుక్కలు, పందుల బెడద తీవ్రంగా ఉందన్నారు.

హుండీ లెక్కింపు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మారుతి మందిరం హుండీని దేవాదాయ, ధర్మాదాయ జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ పర్యవేక్షణలో శుక్రవారం లెక్కించారు. ఆదాయం రూ. 21,535 వచ్చింది. ఆలయ ఈవో రవీందర్ గుప్తా మాట్లాడారు. హనుమాన్ జయంతి నుంచి శుక్రవారం వరకు హుండీ ఆదాయం లెక్కించినట్లు వివరించారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. ఆర్ఎల్‌సీ బషీర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కేటగిరీలలో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా తీసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాహిద ఫిర్దోస్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7995057941కు సంప్రదించాలన్నారు.

రెంజల్ ఎంఈవోగా రామారావు

రెంజల్(బోధన్): రెంజల్ ఎంఈవోగా రామారావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల పీఆర్‌టీయూ కార్యదర్శి సాయరెడ్డి తెలిపారు. రెంజల్ ఎంఈవో గణేశ్‌రావ్ అనారోగ్యంతో సెలవులో ఉండటంతో నవీపేట్ ఎంఈవో రామారావుకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు.

పీఎం శ్రీ పథకానికి మగ్గిడి పాఠశాల ఎంపిక

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీఎం శ్రీ పథకానికి ఎంపికైనట్లు సర్పంచ్ సుద్దపల్లి సుమలత శుక్రవారం తెలిపారు. పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులతో పాటు, కంప్యూటర్ ల్యాబ్, తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులకు కేటాయించే వరకు ఉద్యమిస్తాం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంగడి బజార్‌లో నిర్మించిన రైతు బజార్ మడిగెలను లబ్ధిదారులకు కేటాయించే వరకు ఉద్యమిస్తామని కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్, మీర్ మాజీద్ అలీ, విట్టం జీవన్ స్పష్టం చేశారు. మడిగెలను లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించకపోవడంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేయాలని పిలుపునివ్వగా పోలీసులు నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రైతు బజార్ మడిగెలను ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించకపోవడంలో ఆంతర్యమేమిటని మున్సిపల్ అధికారులు, పాలకవర్గాన్ని ప్రశ్నించారు.

కొనసాగుతున్న సాధుసమ్మేళనం

బాల్కొండ: మండల కేంద్రంలో ఇందూరు సాధు పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన 17వ వేదాంత జ్ఞాన మహాసభల సాధుసమ్మేళనం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. జిల్లాలోని వివిధ ఆశ్రమాలకు చెందిన పండితులు, సాధువులు తరలి వచ్చి ధర్మ ప్రవచనాలను బోధించారు.

డంపింగ్‌యార్డులా సాగర్ కాలువ

- నవీపేటలో శిథిలావస్థకు చేరి చెత్తాచెదారంతో నిండిన వైనం
- ముందుకు కదలని మురికి
- పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు



వ్యాపార సముదాయాల వెనుక..



నవీపేట జీపీ కార్యాలయం ముందు నిజాంసాగర్ డి-50 కాలువ దుస్థితి

నవీపేట: పంటలకు సాగు నీరందించే కాలువలకు మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు సాగు నీరందించే డి–50 ప్రధాన కాలువకు ఎనిమిదేళ్ల కిందట మరమ్మతులు చేపట్టారు. ఈ డి–50 ప్రధాన కాలువకు 15 ఉప కాలువలు ఉన్నాయి. దాదాపు 18 గ్రామాలలోని 15 వేల ఎకరాలకు ఈ కాలువ సాగునీటిని అందిస్తోంది. నవీపేట మినహా అన్ని ప్రాంతాలలో ఆధునీకరణ పనులను పూర్తి చేశారు. నవీపేటలో కాలువను ఆనుకుని వ్యాపార సముదాయాలు ఉండడంతో అన్ని ప్రాంతాలలో పనులు పూర్తయ్యాక ఇక్కడ మొదలు పెడతామని అప్పట్లో ఇరిగేషన్ అధికారులు వాయిదా వేశారు. ఎనిమిదేళ్లు గడిచినా పనులకు మోక్షం కలగలేదు.

అడ్డంకిగా మారిన వ్యాపార సముదాయాలు

నవీపేట మండల కేంద్రంలో 400 మీటర్ల మేర నిజాంసాగర్ డి–50 ప్రధాన కాలువ విస్తరించింది. నాలుగు దశాబ్దాల కిందట నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ కాలువకు ఒక వైపున తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి ఇచ్చారు. కానీ అవి పక్కా నిర్మాణాలుగా మారడం... క్రయవిక్రయాలు జరగడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. మొత్తం 63 వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు ఈ కాలువ వెంబడి ఉన్నాయి. పలుమార్లు యజమానులకు ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నిర్మాణాలు తొలగిస్తే రోడ్డున పడుతామని యజమానులు ప్రజాప్రతినిధులను వేడుకోగా పనులకు బ్రేక్ పడింది.

అంతా కాలువలోనే..

డి–50 కాలువకు ఒక వైపున వ్యాపార సముదాయాలు ఏర్పడ్డాయి. మరో వైపున కటింగ్ షాపులు, చికెన్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు ఇతర వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వెంట్రుకలు, బ్లేడ్ ముక్కలు, చికెన్ సెంటర్, టిఫిన్ సెంటర్‌లలోని వ్యర్థాలను కాలువలో పడేస్తున్నారు. తొలగింపును ససేమిరా అన్న వ్యాపారులు వ్యర్థాలను కూడా అందులోనే పడేసి మురికికూపంలా మార్చేశారు. సాగునీరు ప్రవహించే సమయంలో ఆయకట్టు రైతులు ఈ వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోయింది.

ప్రతిపాదనలు పంపిస్తాం

నవీపేటలో నిజాంసాగర్ కాలువ మరమ్మతులు మిగిలిపోయాయి. ఈ విషయమై ఎస్ఈ, ఈఈల దృష్టికి తీసుకెళ్లాను. మరమ్మతుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాలువలో వ్యర్థాలను తొలగించేందుకు ప్రతి సీజన్‌లో రూ.12 వేలు ఖర్చవుతోంది. కాలువ మరమ్మతులు, వ్యర్థాల తొలగింపునకు వ్యాపారులు కూడా సహకరించాలి.

– బలరాం నాయక్, ఇరిగేషన్, డీఈఈ

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



రుద్రూర్‌లో వీధులు ఊడ్చి నిరసన తెలుపుతున్న వీవోఏలు



కోటగిరిలో..



మెండోరా మండల కేంద్రంలో..

రుద్రూర్: న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని ఐకేపీ వీవోఏలు ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్ల సాధనకు వీవోఏలు రుద్రూర్‌లో చేస్తున్న సమ్మె ఐదో రోజుకు చేరింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో శుక్రవారం పరిసరాలు శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం అమలు చేయాలని వారు కోరారు. వీవోఏల మండల సభ్యులు కరుణ, గంగామణి, లావణ్య, మాణికమ్మ, సావిత్రి, సాయిబాబా, గంగాధర్ పాల్గొన్నారు.

కోటగిరి మండల కేంద్రంలో...

మండల కేంద్రంలో వీవోఏలు సమ్మెలో భాగంగా వీధులు శుభ్రం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కోటగిరి మండల వీవోఏల సంఘం ప్రతినిధులు సరిత, సుమ, రాజు, రమేష్ పాల్గొన్నారు.

బాల్కొండ పరిధిలో..

బాల్కొండ: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు ఐకేపీ కార్యాలయాల ఆవరణలో చెత్తను ఊడ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో నిరసన తెలిపారు.

లింకు రోడ్డు నిర్మాణానికి నిధుల అంచనా



రోడ్డు మార్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్భిర్యాల్ గ్రామం నుంచి కోమన్‌పల్లి, బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామాల వరకు లింకు రోడ్డును వేయనున్నట్లు సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ శుక్రవారం తెలిపారు. లింకు రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే నిధులను అంచనా వేయడానికి పీఆర్ ఏఈ నితీష్ ఆయా గ్రామాల మార్గాన్ని పరిశీలించారు. నిధుల అంచనా నివేదికను ఎమ్మెల్యేకు సమర్పించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. బీఆర్ఎస్ నేతలు అశ్విన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పల్లె గంగారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ విద్వేష రాజకీయాలను వ్యతిరేకించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ నేత విఠల్ గౌడ్

బోధన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, కుల, మత విద్వేష రాజకీయాలను వ్యతిరేకించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్‌బాబు అన్నారు. వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి హఠావో, దేశ్‌కు బచావో నినాదంతో ప్రజలను చైతన్యపర్చేందుకు పార్టీ అధిష్టానం ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. షేక్‌బాబు మాట్లాడుతూ.. తమ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ విద్వేష రాజకీయాలను నిలువరించేందుకు దేశంలోని 24 ప్రజాస్వామ్య లౌకిక పార్టీలతో కూటమి ఏర్పడిందని తెలిపారు. నాయకులు గౌస్ మోహిన్, నాగేశ్వర్‌రావు, సలీం, శంకర్, సాయిలు, షబ్బీర్, అహ్మద్ పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

రుద్రూర్ : ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకుని మే1న కోటగిరి మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే జెండావిష్కరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

'కార్గో' సెంటర్ ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్గో సర్వీస్ సెంటర్‌ను రోడ్డు రవాణా సంస్థ రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శంకర్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సర్వీస్ సెంటర్ ద్వారా ఏ వ్యాపారులైనా ఇతర ప్రాంతాల నుంచి పార్శిల్ తెప్పించుకోవడం లేదా పంపించడం వంటి సేవ పొందవచ్చన్నారు. ఆర్మూర్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వినోద్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..



నందిపేట్ (ఆర్మూర్): ఐలాపూర్‌లో అహల్యాపుర గౌతమేశ్వర శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శివ, గణేష, ఉమాదేవి, నాగేంద్ర, సూర్య, నందికేశ్వర విగ్రహాలను ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఉత్సవాలె శనివారం, ఆదివారం కూడా కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు బోధన్‌లో మహనీయుల జయంతుల సభ



మాట్లాడుతున్న పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

బోధన్: బహుజన బాంధవులు మహాత్మా జ్యోతిబా పూలే, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాంల జయంతిని పురస్కరించుకుని ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సభ నిర్వహించనున్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో కమిటీ డివిజన్ గౌరవ అధ్యక్షుడు పరిమి కోటేశ్వర్‌రావు సభ వివరాలను వెల్లడించారు. ఆచన్‌పల్లి కమాన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందని, తదనంతరం సభకార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించని పక్షంలో కొత్త రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో సభ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. నేతలు విఠల్, భీంరావు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని దేశాయి బీడీ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో 138వ మేడే పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహ కారద్యర్శి ముత్తన్న మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాల పెంపుదల, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపు కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గుమ్ముల అరవింద్, నజీర్ పుప్పాల, మనోజ్ కుమార్, రమేష్, దేశాయి బీడీ కంపెనీ ప్యాకర్స్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని పలు గ్రామాలలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 179 మంది లబ్ధిదారులకు చెక్కులు వచ్చినట్లు ఆయన తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ హుస్సేన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాగా పనిచేసిన వారికి సాయం చేస్తాం



అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ రాజేంద్ర

ఎడపల్లి(బోధన్): అంగన్‌వాడీ కేంద్రాలలో బాగా పని చేసిన వారిని గుర్తించి తమ వంతు సహాయ సహకారం అందిస్తానని ఐ లవ్ మై విలేజ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఐ రాజేంద్ర తెలిపారు. శుక్రవారం నెహ్రూనగర్ 119 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల పట్ల తల్లిదండ్రుల కంటే ఎక్కువగా శ్రద్ధ వహించి వారి ఎదుగుదలకు కృషి చేస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు. గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించి చిన్నతనంలోనే ఎదుగుదలకు కృషి చేస్తున్న టీచర్లను అభినందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినోద మాట్లాడుతూ..డబ్బులు అందరి దగ్గర ఉంటాయని కానీ దాన గుణం అందరికీ ఉండదన్నారు. పని చేసిన వారిని గుర్తించి ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. ఐ లవ్ మై విలేజ్ సమన్వయకర్త ప్రభావతి, బాలికల గురుకుల ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



బోధన్ ఆస్పత్రిలో ఫెర్నాండెజ్ ఆస్పత్రి బృందం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో నార్మల్ డెలివరీలు పెంచే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫెర్నాండెజ్ ఆస్పత్రి బృంద సభ్యులు సూచించారు. శుక్రవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాల మేరకు ఫెర్నాండెజ్ ఆస్పత్రి బృంద సభ్యులు జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ప్రసూతి విభాగం, శస్త్ర చికిత్స, లేబర్ గది, పిల్లల వార్డులో పర్యటించారు. అనంతరం వైద్య బృందం సభ్యులు మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, హెల్త్ సూపర్ వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక జిల్లాతోనే బోధన్ అభివృద్ధి సాధ్యం



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటైతేనే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని న్యాయవాదులు అన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించాలని తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 131వ రోజుకు చేరాయి. దీక్షలో స్థానిక యువకులు మోహన్, శ్రీనివాస్‌లు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం. గంగారెడ్డి దీక్షలను ప్రారరంభించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



వినతి పత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

బోధన్: అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ శుక్రవారం బోధన్ ఆర్డీవో ఆఫీసులో ఏవో ముంతాజుద్దీన్‌కు అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా, డివిజన్ ప్రతినిధులు వినతి పత్రం అందించారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బాన్సువాడ సెగ్మెంట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రుద్రూర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు.

న్యాయం జరిగేలా చూడండి

రెంజల్(బోధన్): అకాల వర్షాలతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు. శుక్రవారం మండలంలోని బోర్గాం, సాటాపూర్, రెంజల్, దూపల్లి, దండిగుట్ట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శశిభూషణ్ సందర్శించి తడిసిన ధాన్యాన్ని, కేంద్రాల్లోని సమస్యలను పరిశీలించారు. రైతులు ఆయన చుట్టూ చేరి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఆర్మూర్, ఆలూర్ మండలాల్లో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్, ఆలూర్ మండలాల్లో నష్టపోయిన పంటలను తహసీల్దార్లు వేణు గోపాల్ గౌడ్, దత్తాద్రి, ఏవో హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ.. ఆర్మూర్, ఆలూర్ మండలాల్లో 675 ఎకరాల్లో సాగు చేస్తున్న నువ్వుల పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి

నందిపేట్ (ఆర్మూర్): నష్టపోయిన రైతన్నకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారాన్ని అందజేయాలని కోరుతూ శుక్రవారం ప్రజాపంథా నాయకులు నందిపేట తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

వరి పంటలను పరిశీలించిన జెడ్పీ చైర్మన్

మాక్లూర్: దెబ్బతిన్న పంటలను శుక్రవారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పరిశీలించారు. కృష్ణానగర్, మాక్లూర్, శాంతినగర్, ముల్లంగి(బి) గ్రామాల్లో పర్యటించిన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని వ్యవసాయ అధికారి పద్మను ఆదేశించారు.

భీమ్‌గల్: పిప్రి గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య పరిశీలించారు. ఏవో కృష్ణ, ఏఈవో లక్‌పతి, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి



డొంకేశ్వర్‌లో సమావేశమైన తహసీల్దార్ రవీందర్



భీమ్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డొంకేశ్వర్ తహసీల్దార్ రవీందర్, నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కల్లాల్లో ఉన్న వడ్లు తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. లారీల కొరత రాకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అంతకు ముందు డొంకేశ్వర్ కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు చేయడం లేదని ధర్నా

భీమ్‌గల్: మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయంలో రైతులకు అది చేస్తాం ఇది చేస్తాం అని చెప్పే ప్రజాప్రతినిధులు, రైతులకు సమస్యలు వచ్చినప్పుడు కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని విమర్శించారు. సొసైటీ సీఈవో అశోక్ గౌడ్‌తో వాగ్వాదానికి దిగారు. ఎక్కువ మంది హమాలీలను తెప్పించి కొనుగోళ్లు పూర్తి చేస్తామని సీఈవో హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో, సావెల్, చాకిర్యాల్ గ్రామాల్లో సావెల్ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ బురుకుల సుకన్య, చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డిలు ప్రారంభించారు.

నవీపేటలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవీపేట: నవీపేట, కోస్లీ, మోకన్‌పల్లి, మహంతం గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వీర్‌సింగ్ శుక్రవారం పరిశీలించారు. నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సంక్షిప్తం

వర్నిలో టీడీపీ మినీ మహానాడు

వర్ని: మండల కేంద్రంలో శనివారం తెలంగాణ టీడీపీ మినీ మహానాడు నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి విఠల్ వెల్లడించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా వర్నిలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహానాడుకు తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని వెల్లడించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి

రెంజల్(బోధన్): నేటి నుంచి వచ్చే నెల 5 వరకు నిర్వహించే పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞం, విగ్రహ ప్రతిష్ఠాపణ కార్యక్రమాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలో గల సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో నూతనంగా నిర్మించిన విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం యజ్ఞశాలను నిర్మించారు. శనివారం సాయంత్రం 3 గంటలకు సీతారామ ఆశ్రమం నుంచి మొదటగా కందకుర్తి గ్రామ దేవతలకు కలశపూజతో ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899